క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. విజయవాడలోని గొల్లపూడికి చెందిన బూర్లె వెంకట్రావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు చెక్..



ఎం.నాగులపల్లిలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లిలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు ఆ శాఖ అధికారులు చెక్ పెట్టారు. అందులో భాగంగా రెండు 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ఏర్పాటు చేశారు. అందులో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద, మరో దాన్ని చికెన్ సెంటర్ వద్ద అమర్చారు. రూ.3,60,000 వ్యయంతో వీటిని ఏర్పాటు చేసినట్టు విద్యుత్ శాఖ భీమడోలు ఏడీఈ గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యంత్రపాటి సునీల్, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లూరి బాపనయ్య తదితరులున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సి.మధుబాబు, జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 16న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతి రోజూ కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కె.స్లీవజోజి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తహసీల్దార్ కె.స్లీవ జోజి బుధవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులు కాకుండా ముగ్గురు బయటి వ్యక్తులు విధులు నిర్వహించడాన్ని తహసీల్దార్ గుర్తించారు. సబ్ రిజిస్ట్రార్ కోర్టు పని మీద వెళ్లడంతో కార్యాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్‌కు చెందిన కంప్యూటర్‌లో బయటి వ్యక్తి పనిచేయడంతో కార్యాలయ సిబ్బంది వద్ద లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు డీటీ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గుండుగొలనుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు, కిషోర బాలికలకు తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సూర్యకళ, ఏఎన్ఎం లక్ష్మీపార్వతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి



నరసన్నపాలెం వై.జంక్షన్‌లో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సదస్సులో ఏలూరు ఎంపీ, చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేస్తున్న మిథున్ రెడ్డి

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయకుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పార్టీ శ్రేణులకు, అభిమానులకు పిలుపునిచ్చారు. బుధవారం నరసన్నపాలెం వై.జంక్షన్ వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ జెట్టి గురునాథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోలవరం, చింతలపూడి నియోజకవర్గ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న జగనన్నకు అందరూ అండగా నిలవాలన్నారు. పోలవరంలో నియోజకవర్గంలో జెండా ఎగురవేసే పార్టీయే అధికారం హస్తగతం చేసుకుంటుందనేది ఆనవాయితీగా వస్తున్న ఆచారం అనీ, ఈసారి రెండు లక్షలకు పైగా మెజార్టీతో ఎంపీగా కారుమూరి సునీల్, 50 వేలకు పైగా మెజార్టీతో రాజ్యలక్ష్మి విజయం సాధిస్తారని ఎంపీ కోటగిరి శ్రీధర్ జోస్యం పలికారు. ఏజెన్సీ మెట్ట ప్రాంత ప్రముఖ నాయకుడు జెట్టి గురునాథరావు వైఎస్సార్‌సీపీలో చేరికతో పార్టీ మరింత బలపడగా, కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురునాథరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్న నాయకులకు మిథున్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, బాలరాజు పార్టీ కండువాలను కప్పి అభినందించారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ మండలాల అధ్యక్షులు పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నున్న సురేష్, తోట వెంకటేశ్వరరావు, కోడూరి భాస్కరరావు, చీర్ల శ్రీనివాసరావు, కోన గంగరాజు, గంటా రమేష్, మిరియాల వెంకటేశ్వరరావు, ఆకుల బాలు, బొల్లి రామకృష్ణ, రాఘవ రాజు సత్యనారాయణ, ముంగమూడి శ్రీనివాసరావు, బాలం సుబ్బారావు, మట్టా సత్యనారాయణ, మువ్వ రమేష్, జంగా బాబ్జి, పైడి ముక్కలకృష్ణ, ముప్పిడి రవి, కనుమూరి రఘురాంరాజు, సారిక శ్రీను, గుంటపల్లి వెంకటేశ్వరరావు, ఆరేపల్లి శ్రీను, ముప్పిడి వెంకటేశ్వరరావు, యర్రమళ్ల సత్యనారాయణ, కర్రెడ్ల నాగేశ్వరరావు, జమ్మి సుబ్బారావు, కుర్రు సుబ్బారావు, షేక్ బిస్మిల్లా, దమ్మిశెట్టి మధు, ప్రత్తిపాటి అబ్బులు, తగరం నాగేశ్వరరావు, పులపాకుల గాంధీ, వలవల సత్యనారాయణ, కరిబండి కృష్ణ, విప్పర్తి రంజిత్ కుమార్, యాళ్ళ అర్జున్, బి.వేణుగోపాలరావు, సత్యం నరసింహమూర్తి, సానా గోపాల్ తదితరుల ఆధ్వర్యంలో వారి అనుచరులు భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లు పంపిణీ చేస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం: ఆరోగ్య సమస్యలు, ఆపదలో ఉన్న వారికి అనేక మందికి ముఖ్యమంత్రి సహాయ నిధుల ద్వారా ఆర్థిక సహకారం అందించడం జరిగిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్‌లను బాధితులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 15 మందికి రూ.20 లక్షలు చెక్‌లను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఆరోగ్యశ్రీ లబ్ధి చేకూరని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఏపుగుంట గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో బుధవారం దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ గ్యారెంటీలూ.. వారంటీ లేని వాగ్దానాలే

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెంలో నాలుగో విడత చేయూత చెక్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఆరు గ్యారెంటీల పేరుతో వారంటీ లేని వాగ్దానాలు చేస్తూ ప్రజలను నట్టేట ముంచేందుకు సిద్ధమవుతున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నాలుగో విడత వైఎస్సార్ చేయూత చెక్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 3449 మంది మహిళలకు సుమారు రూ.6,46,68,750 చెక్‌ను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో బాలరాజు మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు 600 వాగ్దానాలు చేసి ఏదో రకంగా హామీలను అమలు చేయకుండా మహిళలను మోసం చేశారని అన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో పొత్తులు పెట్టుకుని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఏడాదిలోపే అమలు చేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. నవరత్న పథకాల ద్వారా అర్హులైన పేదలందరికీ ఎటువంటి లంచాలకు తావులేకుండా నేరుగా అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేశామని అన్నారు. అమ్మఒడి, రైతు భరోసా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, డ్వాక్రా సంఘాల రుణమాఫీతోపాటు పలు పథకాల్లో నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లోకే సొమ్ములను జమ చేయడం జరిగిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడకపోతే పథకాలు మొత్తం రద్దయ్యే అవకాశం ఉందన్నారు. మళ్లీ కిరికిరి కమిటీలు వస్తాయని, ఆ సమయంలో ప్రజలకు తిప్పలు తప్పవని బాలరాజు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బాగా ఆలోచన చేసి ఏలూరు సమన్వయకర్తగా కారుమూరి సునీల్‌ను, సమన్వయకర్తగా తెల్లం రాజ్యలక్ష్మిని రెండు బటన్‌లను నొక్కి వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కోఆప్షన్ మెంబర్ బాబ్జి, సొసైటీ అధ్యక్షుడు కలగర నాని, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు బన్నే బుచ్చిరాజు, ఎంపీటీసీ కరాటం ఫణీంద్రకుమార్, ఎంపీడీఓ సుధా ప్రవీణ్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ సుబ్బారావు, డీఆర్‌డీఏ డీపీఎం ఎస్‌వీ రామోజీ, వెలుగు ఏపీఎం పద్మావతి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తే పోలవరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

తన భర్త తెల్లం బాలరాజు నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. బుట్టాయగూడెంలో జరిగిన నాలుగోవిడత చేయూత కార్యక్రమంలో మాట్లాడుతూ తన భర్త తరహాలో తరహాలో తాను కూడా పోలవరం నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు ఎనలేని కృషి చేస్తానని రాబోయే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పకొట్టాలన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలనే ఆలోచన తన భర్త బాలరాజుకు ఎంతో ఉండేదన్నారు. అయితే అందుకోతగ్గ ఆయుధం ఆయన చేతికి రాలేదని ఈసారి వస్తే తప్పనిసరిగా పోలవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండే విధంగా తీర్చిదిద్దుతామని ఆమె చెప్పారు.

రిజిస్ట్రేషన్ ఇళ్ల పత్రాల పంపిణీ



సీహెచ్ పోతేపల్లి సచివాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేస్తున్న రాజబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లి, మద్దులగూడెం, కోడిగూడెం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీహెచ్ పోతేపల్లి సచివాలయంలో బుధవారం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, వారికి ఆర్థిక ప్రయోజనాలను చేకూర్చారన్నారు. జగన్ వల్ల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఆయనకు అండగా నిలిచి, వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. సీహెచ్ పోతేపల్లి, మద్దులగూడెం, కోడిగూడెం సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్‌బాబు, చెలికాని ప్రవీణ్, మానుకొండ ప్రసాద్, ఎంపీటీసీలు పల్లపాటి ధర్మారావు, మానుకొండ కన్నయ్య, కోడిగూడెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెలికాని బుల్లియ్య తదితరులున్నారు.


ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేయాలి



కేఆర్‌పురం ఐటీడీఏలో ఎన్నికల నిర్వహణపై పీఓ, ఏపీఓలకు శిక్షణలు ఇస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఎన్నికల శిక్షణలో అందించిన సమాచారాన్ని జాగ్రత్తగా అవగాహన చేసుకుని రాబోయే సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం సాయంత్రం ఎన్నికల నిర్వహణకు పీఓలు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ, ఏవీఎంల వినియోగం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఐటీ అప్లికేషన్, పోస్టల్ బ్యాలెట్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణలో శిక్షణ కార్యక్రమం ఎంతో కీలకమైనదని అన్నారు. శిక్షణ సమయంలో పూర్తి అవగాహన చేసుకుంటే ఎన్నికల నిర్వహణ సులభతరంగా ఉంటుందని అన్నారు. సమష్టి కృషితో ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ స్థాయిలోని పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.

జేకే ఫౌండేషన్ సేవలు అభినందనీయం



కొయ్యలగూడెంలో బొల్లవరపు జాన్ వెస్లీని సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో కమల జోషి ఫౌండేషన్ అధినేత ఖండవల్లి రాబిన్‌పాల్ ఆధ్వర్యంలో కమల జోషి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. సభాధ్యక్షులుగా ప్రసాద్ వ్యవహరించగా, ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొని మాట్లాడారు. జేకే ఫౌండేషన్ ద్వారా జరుగుతున్న దేవుని సేవ, సామాజిక సేవలను అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.420 కోట్లను క్రైస్తవుల అభివృద్ధికి ఖర్చుచేసిందని వివరించారు. త్వరలో జరిగే ఎన్నికలలో ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని క్రైస్తవులకు పిలుపునిచ్చారు. నాని బాబు, కార్యక్రమంలో పాస్టర్ రామ్మోహన్, బ్రదర్ పవన్, పాస్టర్ ప్రమోద్, పాస్టర్ డేవిడ్సన్, సిస్టర్ చంద్ర కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కామవరపుకోట: ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా చదువుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి డి.సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు, విద్యా హక్కు చట్ట ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించబడిందని, 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం ఈ నెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. గ్రామ వార్డు సచివాలయాలు, ఇంటర్నెట్ కేంద్రాలు, మీసేవ కేంద్రంలో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వివరాలకు స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

మండుతున్న ఎండలు.. భీతిల్లుతున్న జనం



ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా ఉన్న చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో గత నాలుగు రోజులుగా ఎండలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ఎండల తీవ్రతను తట్టుకోలేక ప్రజలు అల్లాడి పోతున్నారు. దీనికి తోడ ఉక్కబోత కూడా ప్రారంభం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యం అవుతున్నాయి. దీంతో మార్చి నెలలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే రోహిణీ కార్తెలో ఎండలు ఇంకెంత దారుణంగా ఉంటాయోనని ప్రజలు హడలిపోతున్నారు. ఎండలకు మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జన సంచారం అంతగా కనిపించడం లేదు. ప్రయాణాలలో ఎండ దెబ్బకు తాళలేక ప్రయాణీకులు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండబోతున్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బాలకార్మికులను ప్రోత్సహించడం నేరం



శ్రీవారి కొండపైన దుకాణాల వద్ద తనిఖీలు చేసేందుకు వచ్చిన కార్మిక శాఖ అధికారులు

ద్వారకాతిరుమల: బాలలను కార్మికులుగా మార్చే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కార్మిక ఉప కమిషనర్ (ఏలూరు) పి.శ్రీనివాస్ అన్నారు. శ్రీవారి క్షేత్రంలోని కొండపైన, కొండ దిగువనున్న పలు దుకాణాల్లో బుధవారం ఆయన బాల కార్మికులను కనుగొనేందుకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 14 నుంచి 18 ఏళ్ల లోపు బాల, బాలికలను పనిలో పెట్టుకున్నా, ప్రోత్సహించినా, అలాగే పని చేయమని ఒత్తిడి చేసే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. చిన్న పిల్లలతో బిక్షాటన చేయించడం, ప్రోత్సహించడం వంటివి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఎవరైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు, 1098 ద్వారా చైల్డ్ హెల్ప్‌లైన్‌కు, 100 నెంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి ఏలూరు -2 జె.గోపాలకృష్ణ, సచివాలయం మహిళా పోలీస్ లక్ష్మీ సుజన, సీఆర్పీ అశోక్, కార్మిక శాఖ సిబ్బంది ఉన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

కుక్కునూరు: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అబేద్కర్ విగ్రహ నిర్మాణానికి పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు భూమి పూజ చేయనున్నట్టు అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ, సమతా సైనిక్‌దళ్ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గురువారం ఉదయం 9 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపులో భూపరిహారం పొందిన భూములను అర్హులైన పేదలకు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం ధవళేశ్వరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అధికారి, కేఆర్‌పురం ఐటీడీఏ పీఓ సూర్యతేజలను కలిసి వినతిపత్రాన్ని అందించారు. కొత్తూరు నిర్వాసితులకు మద్రిపాడులో ఆర్‌అండ్ఆర్ కాలనీలో వారికి కేటాయించిన ఇళ్లను అప్పజెప్పాలని కోరారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, నిర్వాసితులు కొండ్రు నరసింహారావు, సోడే సత్యవతి, సరియం హారనాథ్, మిడియం తిరుపతమ్మ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు మైనర్లు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఆటోలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. యువకులు గుంటూరుకు చెందిన వారని, వీరి వద్ద పాత తుప్పుపట్టి విరిగిపోయిన నాటు తుపాకీ ఉన్నట్లు సమాచారం. యువకులను, విరిగిన నాటు తుపాకీ, ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మద్ది అంజన్న సన్నిధిలో...



స్వామివారి సన్నిధిలో విజయరాజు, గురునాథరావు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామివారిని బుధవారం వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, పార్టీ నాయకులు జెట్టి గురునాథరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

నేడు పోలవరం ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి గురువారం మండలంలో పర్యస్తారని ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లకుంట, దాచారం, కుక్కునూరు, మారేడుబాక, మాధవరం గ్రామాల్లోని సచివాలయ, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గీతాంజలి మృతికి సంతాపం

జంగారెడ్డిగూడెం: తెనాలికి చెందిన గీతాంజలి మృతికి జంగారెడ్డిగూడెంకు చెందిన జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రచార కార్యదర్శి పెసరగంటి త్రిమూర్తులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు. గీతాంజలి మృతిపై సమగ్ర విచారణ చేసి, మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే గీతాంజలి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



కామవరపుకోటలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తడికలపూడి ఎస్సై జయబాబు అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో, బుధవారం మండలంలో స్థానిక చౌతాన సెంటర్ నుంచి దుర్గామహల్, చెక్ పోస్ట్ మీదుగా కొత్తూరు బస్టాండ్ వరకు పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం రావికంపాడులో గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జయబాబు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

రైతులకు పనిముట్ల పంపిణీ



జీలుగుమిల్లిలో రైతులకు పనిముట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): పొగాకు సాగులో సాంకేతికతను ఉపయోగించుకుని అధిక దిగుబడులను సాధించాలని సీటీఆర్ఐ ఆర్ఎస్ జీలుగుమిల్లి హెడ్‌డాక్టర్ వైవీ సుబ్బయ్య అన్నారు. జీలుగుమిల్లి ఐసీఏఆర్ సీటీఆర్ఐ పరిశోధనా స్థానంలో బుధవారం గిరిజన పొగాకు రైతులకు శిక్షణ, సాంకేతికతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పొగాకు సాగుకు అనుకూలమైన సాంకేతిక పరికరాల అభివృద్ధికి సీటీఆర్ఐ చేస్తున్న కృషిని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం రైతులకు ట్యాపింగ్ యంత్రాలు, ప్రోట్రేలు, ఎరువులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపప్రణాళిక నోడల్ ఆఫీసర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుమన్ కళ్యాణి, శాస్త్రవేత్త డాక్టర్ విశ్వనాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.